గంజాయి పట్టివేత

బండ్లగూడ : శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌రావు తెలిపిన వివరాలు.. ఎన్‌డీపీఎస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది విశ్వసనీయ సమాచారం మేరకు పీవీఎన్ ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నం. 240 సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఒడిశాలోని గజపతి జిల్లాకు చెందిన సుదీప్‌కుమార్‌ను అరెస్ట్ చేసి 11.825 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడు తన స్వస్థలం నుంచి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి రాజేంద్రనగర్, చింతల్‌మెట్, ఆరాంగర్‌లో విక్రయించేవాడని విచారణలో తేలింది. నిందితుని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కర్నాటక నుంచి తెలంగాణాకు..

వెంగళరావునగర్ : కర్నాటక నుంచి తెలంగాణకు గంజాయి తెచ్చిన ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. బీదర్ నుంచి గంజాయిని తెచ్చి కార్మికనగర్‌లోని ఓం నగర్‌కు చెందిన ధనుంజయ్ తన స్నేహితులతో కలిసి సేవిస్తున్నట్లు వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సోమవారం రాత్రి దాడులు నిర్వహించి మేస్త్రీ ధనుంజయ్, అతడి మిత్రులు పల్లె ప్రవీణ్, కల్లిపాక ఈశ్వర్, బోరబండ సైట్‌త్రీకు చెందిన తలారి వినోద్‌ను అరెస్ట్‌చేసి.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ గంజాయి దొరకక పోవడంతో బీదర్‌లోని సికిందర్ వద్ద 25 ప్యాకెట్లను రూ.5 వేలకు కొనుగోలు చేసినట్లు అంగీకరించారు. కేసు తదుపరి విచారణకు మధురానగర్ పోలీసులకు అప్పగించారు.

ఎలక్ట్రానిక్ స్టోర్‌లో చోరీ

ఎలక్ట్రానిక్ స్టోర్‌లో సామగ్రి చోరీకి గురైన ఘటన మధురానగర్‌లో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్‌లోని బ్లింక్ ఇట్ స్టోర్‌లో దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ స్టోర్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. స్టోర్‌కు వచ్చే.. వెళ్లే పరికరాల రికార్డ్‌ను ప్రవీణ్‌కుమార్ చూసుకుంటుంటారు. ఈ క్రమంలో 15 రకాల పరికరాలు రికార్డ్‌లో ఉన్నప్పటికీ కనిపించకుండా పోయాయి. దాంతో ఇన్‌చార్జి వీరాంజనేయులుకు చెప్పడంతో ఆడిటింగ్ నిర్వహించారు. చోరీ జరిగినట్లు గుర్తించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

పెద్దషాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించి నగదు అందజేస్తున్న మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్, ఉపాధ్యాయులు

వ్యవసాయ యూనివర్సిటీ ప్రాంగణంలో మౌఖిక పరీక్షలో పాల్గొన్న ఉద్యాన విద్యార్థులు

శంషాబాద్ రూరల్ : విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దషాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షల్లో 574 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన పూజ, తర్వాత స్థానాల్లో నిలిచిన సిద్దు , వర్షిణిలను సన్మానించారు. మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించి జిల్లా రెండో టాపర్‌గా నిలిచిన పూజ మా గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. మాజీ సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పాఠశాలలో విశాలమైన మైదానం, ఏర్పాట్లు చేశామని ఉపాధ్యాయులు ఇంకా మంచిపేరు తీసుకురావాలని కోరారు మాజీ ఎంపీపీ పూజకు 10వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సిద్ధు, వర్షిణిలకు 5వేలు అందజేశారు. ఎస్సై నర్సింహారావు ముగ్గురికి 2వేల చొప్పున అందజేశారు. 69 మంది విద్యార్థులకు గాను 61 మంది పాసైన్నట్లు హెచ్ఎం గోపాల్ తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు బాల్‌రాజ్, నాయకులు తాళ్ల గణేష్, రాజునాయక్, బోద్దం నారాయణ, మహేష్‌యాదవ్, శ్రీధర్,మహేందర్, పవన్‌పటేల్, మోహన్‌నాయక్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చొరవ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం...

ఉపాధ్యాయుల చొరవతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉత్తమ మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచానని పూజ తెలిపారు. అమ్మనాన్న ఓ తోటలో వ్యాచ్‌మేన్‌గా పని చేస్తారు. వారు పడుతున్న కష్టం తాను పడకుండా ఉండాలనే లక్ష్యంతో పదో తరగతి ప్రారంభం నుంచి ఉపాధ్యాయులు చొరవతీసుకొని సలహా సూచనాలు ఇవ్వడంతో చదువుపై శ్రద్ధపెట్టి మంచి మార్కులు సాధించాను. డాక్టర్ కావాలనేది తన లక్ష్యం అని తెలిపింది.

సత్తా చాటిన ఉద్యాన విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 12 : మౌఖిక పరీక్షలో కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాలలో నాలుగో సంవత్సరం ఉద్యాన విద్యని అభ్యసిస్తున్న విద్యార్థులు సత్తాచాటారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజిరెడ్డి పర్యవేక్షణలో డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ చీనా నాయక్ అనుసంధానంలో ప్రాంగణ నియామకాలను చేపట్టారు. హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ కామారెడ్డిసంస్థ ఆధ్వర్యంలో , ఆయిల్ ఫామ్ ఫీల్డ్ ఆఫీసర్ క్లస్టర్ మేనేజర్‌కు ఉద్యాన కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల నుంచి 20 మంది పాల్గొన్నారు. మౌఖిక పరీక్షల అనంతరం హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ కామారెడ్డి సంస్థ ఆరుగురు ఎంపిక చేశారు. ఫ్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మెదక్ సంస్థ ఆధ్వర్యంలో పరీక్షలను నిర్వహించారు.ఫ్రీ యూనిట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్ మోజర్లకు చెందిన ఐదుగురిని ఎంపిక చేసింది. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి ప్రశాంత్, నిరోషా, బి.పవన్ కుమార్ ఎన్.రామకృష్ణ , మేఘన పాల్గొన్నారు.

శుభాకాంక్షలు

ఖైరతాబాద్, మే 13 : బీఆర్ఎస్ నాయకుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేశ్‌యాదవ్ ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎస్‌కే అహ్మద్, యువజన అధ్యక్షుడు లక్ష్మణ్, మిస్టర్ ఇండియా శివ, బాబు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

మల్కారం రైతువేదికలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుకృత్‌కుమార్

శంషాబాద్ రూరల్ : సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం అఖిల భారత సూక్ష్మపోషకాల విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ సుకృత్‌కుమార్, డాక్టర్ శంకర్ సూచించారు. మంగళవారం మల్కారం రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేతలు కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డాక్టర్ సుకృత్‌కుమార్, డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించి తద్వారావరువులు వాడకంతో పోషకాలు లభ్యత పూర్తి కాలానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. యూరియా అధిక మోతాదులో వాడటంతో చీడపీడల సమస్య ఏర్పడటమే కాకుండా పెట్టుబడి పెరుగుతుందని వివరించారు. నేల నాణ్యత తగ్గుతుందని, సరైన మోతాదులో మందులు వాడాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కోనుగోలు సమయంలో పరిశీలించాలని, . పంట మార్పిడితోనే దిగుబడులు పెరుగుతాయని పేర్కొన్నారు. పశుగ్రాసంగా ఉపయోగపడే చెట్లు పెంపకంపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి శ్వేత, విస్తరణ అధికారి సురేశ్ రెడ్డి, రైతులు ఆయినాల జగన్‌మోహన్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ దుర్గా సత్తయ్య, జైపాల్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకటేశ్, చంద్రయ్య పాల్గొన్నారు.

మీర్ ఉస్మాన్ అలీఖాన్‌తోనే నగర అభివృద్ధి

హిమాయత్ నగర్ : ఏడోనిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ నగర అభివృద్ధికి కృషి చేశారని నిజాంస్ విత్ ఖానాజాదన్ అసోసియేషన్ అధ్యక్షుడు హైదర్‌అలీ తెలిపారు. ఉస్మాన్ అలీఖాన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం కింగ్‌కోఠి, జోడి మాజీద్ లోని అలీఖాన్ సమాధి వద్ద చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నవాబ్ యూసుఫ్, అన్వర్ అలీ, మహ్మద్ హద్రామి, అజ్జు బహ్రూయిన్, ఖలాద్ బఫానా, బిన్షామ్లాన్, మహ్మద్ అ త్తా స్, నాదర్ అలీ షా, హఫీజ్ అజ్మల్ హుస్సేన్, మునీర్ అస్లాం అలీ పాల్గొన్నారు

బీఆర్ఎస్ నాయకుల పర్యటనలు

వినాయక్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్

మైలార్‌దేవ్‌పల్లి, మే 13: సమస్యలు తెలుసుకునేందుకు పర్యటనలు నిర్వహిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ అన్నారు. మంగళవారం శుభోదయం మైలార్‌దేవ్‌పల్లి కార్యక్రమంలో భాగంగా వినాయక్‌నగర్ బస్తీలో నాయకులతో కలిసి పర్యటించారు. ప్రజలు గ్రేటర్ హైదరాబాద్‌లో ఉన్నారా.. మారుమూల గ్రామంలో ఉన్నారా.. అనే పరిస్థితిలో ఉన్నామన్నారు.తాగునీరు రెండు బిందెల కన్నా ఎక్కువ రాని పరిస్థితి ఉందని, ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. రోడ్ల మరమ్మతులు, స్ట్రీట్‌లైట్లు, డ్రైనేజీ సమస్యలున్నాయని వాపోయారు. కార్యక్రమంలో ఎన్.రాముయాదవ్, యూత్ అధ్యక్షులు అక్కం రాఘవేందర్‌యాదవ్, రాజేష్, సోమ శ్రీనివాస్‌గుప్తా, చిరంజీవి, అరుణ్‌ముదిరాజ్, ఎడ్లకాడి సూర్యం, కొంపల్లి జగదీష్, ఈర్లపల్లి ప్రవీణ్, భగవాన్‌దాస్, సరితా, మహేష్, రాజు, వెంకటరమణ, రాజు, భాస్కర్, అశోక్‌కుమార్, మల్లేష్, శేఖర్, భూదేవి, అరుణరెడ్డి, లక్ష్మీదేవి, పారిజాతం పాల్గొన్నారు.

స్థానిక అవసరాలకే వినియోగించాలి

ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్, స్థానికులు

బంజారాహిల్స్,మే 13: జూబ్లీహిల్స్ డివిజన్ పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీని అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని స్థానికుల అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని.. వేరే నియోజకవర్గాలకు చెందిన అవసరాల కోసం స్థలాన్ని కేటాయించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. షేక్‌పేట మండలం సర్వే నం. 403లోకి వచ్చే పద్మాలయ అంబేద్కర్‌నగర్ పక్కన ఉన్న కేరళ భవన్ స్థలం పక్కన 1.30 ఎకరాల స్థలాన్ని పాతబస్తీకి చెందిన వెస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయం కోసం కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్, స్థానికులు మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు.

ఫిలింనగర్‌లో జూనియర్ కాలేజీ నిర్మాణం, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్, ప్రభుత్వ ఆస్పత్రి లాంటి అభివృద్ధి పనుల కోసం స్థలం అవసరం ఉండగా, వేరే నియోజకవర్గానికి చెందిన ఆర్టీఓ ఆఫీసుకు స్థలం కేటాయించిన విషయాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వివరించారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్థలం కేటాయింపు ఎలా చేస్తారంటూ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఫోన్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్ నిలదీశారు. తనకు సైతం సమాచారం లేదని, సంబంధిత అధికారులతో మాట్లాడి సరైన చర్యలు తీసుకుంటామని మంత్రి పొన్నం హామీ ఇచ్చారు. తన క్యాంపు కార్యాలయం కోసం స్థలం ఇవ్వాలని ఏడాదిన్నర నుంచి అడుగుతుంటే పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం ఆర్టీఏ కార్యాలయానికి స్థలం ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికుల కోసమే స్థలం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్‌కు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నేతలు శంకర్, జ్యోతి, రాజు జేజోల, షాహీన్ బేగం పాల్గొన్నారు.

మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి

వినాయకనగర్‌లోని శ్మశానవాటికను పరిశీలించి అధికారులకు అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి : శ్మశానవాటికల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వినాయకనగర్‌లోని శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురవుతుందని వడ్డెర సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి సందర్శించారు. ప్రహరీ, వెయింటింగ్ హాల్, బోర్, తాగునీరు, టాయిలెట్స్ అంశాలపై చర్చించారు. అభివృద్ధి పనుల మంజూరుకు ప్రతిపాదనలను పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంపంగి నర్సింహ, బాలరాజు, శ్రీను, బోధస్ హరి కృష్ణ, శ్రీను, రాజు, ప్రసాద్, సురేశ్, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, దండుగుల ప్రసాద్, ఇంద్ర పాల్గొన్నారు.

సైన్యం తెగువ గొప్పది

మైలార్‌దేవ్‌పల్లి : సైన్యం తెగువ గొప్పదని తెలంగాణ ఎకానామిక్ ఫోరం అధ్యక్షుడు, రచయిత నేదునూరి కనకయ్య అన్నారు. అత్తాపూర్ లక్ష్మీనగర్ జీహెచ్ఎంసీ పార్కులో ' ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ఆపరేషన్ సిందూర్ పాత్ర ' పై సమావేశం ఏర్పాటు చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు చల్లా వెంకట్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. అత్తాపూర్ యోగా సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ బి.సీతారాం, కన్వీనర్ మహేందర్, కార్యనిర్వహక అధ్యక్షుడు బి.భానుమతి, నాగేశ్వర్ రావు, నరేశ్, గోపాల్‌రెడ్డి, శ్రీకాంత్, బోజీ రెడ్డి, కె.మూర్తిరాజు, మనోహర్‌రావు, బాల కృష్ణ, చిన్న, సరిత పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడుతున్న మాజీ ఉద్యోగులపై కేసు

బంజారాహిల్స్,మే 13: అక్రమాలకు పాల్పడుతూ, డబ్బులు వసూలు చేస్తున్న ఓ ఆలయ మాజీ ఉద్యోగులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కే సు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఓ ఆలయంలో రాజుసింగ్, ఠాకూర్ అజ య్ సింగ్‌లు గతంలో పనిచేసేవారు. సంస్థకు భక్తులు ఇచ్చే విరాళాలను కాజే సి బోగస్ రశీదులు ఇవ్వడం, కొత్త వ్యక్తు ల వద్దనుంచి విరాళాలు సేకరించడం చేస్తుండంతో వారిని ఉద్యోగంలోనుంచి తొలగించారు. ఆ తర్వాత కూడా సంస్థ లో పనిచేస్తున్న కోటేశ్వర్‌రావు, నరేందర్ సింగ్‌లతో కలిసి వారు మోసాలు కొనసాగిస్తున్నట్లు సంస్థ యాజమాన్యం గుర్తించింది. వీరందరూ కలిసి పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆలయం ప్రతినిధి సూర్యనారాయణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయ గా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల అమలులో విఫలం

మణికొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కుల అమలులో పూర్తిగా విఫలమయ్యాయని సీఐటీయూ కన్వీనర్ డప్పు ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అందుకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో మే 20న మున్సిపాలిటీ కార్మికులు, ఆశవర్కర్లు, కార్మిక వర్గాలతో సమ్మె చేపడుతున్నామని తెలిపా రు. నార్సింగిలో సమ్మె వాల్‌పోస్టర్‌ను కార్మిక సంఘాల నాయకులతో ఆవిష్కరించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సమానమైన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు మహిపాల్ యాదవ్, హైమద్. జనార్దన్ రెడ్డి, వంశీ, శ్రీకాంత్, బాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగులకు న్యాయం చేయాలి

హిమాయత్ నగర్, మే 13 : పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆంగోతు రాంబాబు నాయక్ మంగళవారం డిమాండ్ చేశారు. పోలీస్ గృహ నిర్మాణ సంస్థలో గిరిజన ఉద్యోగులను తమకు రావాల్సిన ప్రమోషన్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలర్, జీత భత్యాలు పెంచమని అడగడంతో లంబడోళ్ళని కుల దూషణకు పాల్పడిన ఎండీ రమేశ్‌రెడ్డిపై జాతీయ ఎస్టీ కమిషన్ న్యూఢిల్లీకి ఫిర్యాదు చేయగా ఈ నెల 8న జరిగిన విచారణలో అట్రాసిటీ కేసు బుక్ చేయాలని ఆదేశించిందన్నారు . ఈ నేపథ్యంలో పోలీస్ గృహ నిర్మాణ సంస్థ ఎస్టీ ఎంప్లాయీస్ వ్యవస్థాపక అధ్యక్షులు అజ్మీర రాందాస్‌కు రావలసిన బకాయి డీఏ, ఐఆర్ ఇవ్వమని అడిగితే కక్షగట్టి ఏపీకి చెందిన ఉద్యోగి ఆర్.సీ.కుమార్, అతని పీఏ దినకర్, ఎండీ రమేశ్ రెడ్డి, సుప్రసన్న, తులసిదర్ రెడ్డి సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించారని ఆరోపించారు. వీరిపై తాము ఈ నెల 9న అదే పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసినప్పటికీ అట్రాసిటీ నమోదు చేయడంలో పోలీసులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. వీరితో అజ్మీర రాందాస్‌కు ప్రాణహాని ఉందన్నారు.. ఏం జరిగినా వారే బాధ్యత వహించాలన్నారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కారం అవ్వకపోతే పోతే రాష్ట్రంలో ఉన్న సేవాలాల్ సేన సైనికులు, బంజారా సంఘాలు, ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాలు అందరూ ఏకమై తెలంగాణ పోలీస్ గృహ నిర్మాణ ప్రధాన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బెట్టింగ్‌తో అప్పుల పాలైన వ్యక్తి అదృశ్యం

వెంగళరావునగర్ : ఆన్ లైన్ బెట్టింగ్‌లో అప్పుల పాలైన ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై రాజు రాథోడ్ తెలిపి వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్, కవాడిపల్లి మండలానికి చెందిన ఎం.నవీన్ ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడి అప్పులు చేశాడు. వేధింపులు అధికం కావడంతో ఫిబ్రవరిలో ఘట్కేసర్ సింగారం లో ఉంటూ హోంగార్డుగా పనిచేసే బామ్మర్ది కె.రాఘవులు దగ్గరికి వచ్చి ఉంటున్నాడు. నాగోల్‌లోని ఉద్యోగం చేస్తూ అమీర్‌పేటలోని ఏఎస్ రెడ్డి స్పోకెన్ ఇంగ్లిష్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. 11న అమీర్‌పేట వచ్చిన నవీన్ కనిపించకుండా పోయాడు. ద్విచక్ర వాహనాని సెంటర్ పార్కింగ్ స్థలంలో పార్కు చేశానని, తాను వెళ్లి పోతున్నానని బామ్మర్థికి మెయిల్ పెట్టాడు. రాఘవులు అమీర్‌పేటలోని స్పోకెన్ ఇంగ్లిష్ సెంటర్ వద్దకు వచ్చి ఆరా తీయగా తమకేమి తెలియదని చెప్పడంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

జూబ్లీహిల్స్ : డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని యూసుఫ్‌గూడ డీసీ జాకియా సుల్తానా, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. కార్పొరేటర్ కార్యాలయంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సీఎస్‌సీ), హైదరాబాద్ సిటీ పోలీస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవెర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పరిశీలిస్తూ చెడు అలవాట్లకు గురి కాకుండా, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూసీడీ, డీపీఓ వెంకట కిషన్ రావు, హెచ్‌సీఎస్‌సీ ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ, వలంటీర్లు రవి శంకర్, శిరీష రెడ్డి, క్యూర్ ట్రైనర్లు ఎస్.సుధాకర్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మహావీర్ స్కోడా షోరూమ్‌లో కొత్త స్కోడా కోడియాక్ విడుదల

సిటీబ్యూరో, మే13,(నమస్తే తెలంగాణ): ప్రముఖ ఆటోమొబైల్ డీలర్ మహావీర్ గ్రూపునకు చెందిన మహావీర్ స్కోడా, శనివారం కొత్త తరహా స్కోడా కోడియాక్ 4x4 కారును విడుదల చేసింది. వాహన డెలివరీలు ప్రారంభమైనట్లు ప్రకటించింది. స్కోడా కోడియాక్ 2.0 టీఎస్ఐ పెట్రోల్ ఇంజన్ (204 పీఎస్ పవర్, 320 ఎన్ఎం టార్క్) సామర్థ్యంతో రోడ్డుపై అద్భుతమైన పనితీరును అందించనుంది. 7-స్పీడ్ డీఎస్‌జీ గియర్‌బాక్స్, 4x4 డ్రైవ్ సిస్టమ్, 9 ఎయిర్‌బ్యాగ్స్, పానోరమిక్ సన్‌రూఫ్, ఎర్గో మసాజ్ సీట్స్, 13 స్పీకర్ల కాన్టన్ సౌండ్ సిస్టమ్, స్మార్ట్ డయల్స్, అప్‌టూడేట్ ఇన్‌ఫొటైన్‌మెంట్ వ్యవస్థ ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. బహుళ పనితీరు, భద్రత, విలాసవంతమైన డ్రైవింగ్ అనుభూతిని కలిగించే ఈ వాహనంలో 1,976 లీటర్ల సామర్థ్యం గల లగ్గేజ్ స్పేస్ ఉంది. స్కోడా కొత్త కోడియాక్‌కి 5 సంవత్సరాల లేదా 1.25 లక్షల కి.మీ. వారంటీ, 10 సంవత్సరాల రోడ్‌సైడ్ అసిస్టెన్స్, మొదటి సంవత్సరం స్కోడా సూపర్ కేర్ ఉచితంగా లభించనున్నాయి. ప్రారంభ ధర రూ. 46.89 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించబడింది. హైదరాబాద్‌లోని మహావీర్ స్కోడా షోరూమ్‌లో టెస్ట్ డ్రైవ్‌లు, బుకింగ్‌లు అందుబాటులో ఉన్నాయి.

సెల్ ఫోన్ స్నాచింగ్

వెంగళరావునగర్ : బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకుని కూతురుతో కలిసి క్యాబ్‌లో బయలు దేరుతుండగా గుర్తు తెలియని వ్యక్తి సెల్ అపరించుకుపోయాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన ఆర్లగడ్డ రాజశేఖర్ మేస్త్రీ . తన కూతురుతో కలిసి ఎల్లమ్మను దర్శించుకునేందుకు సోమవారం సాయంత్రం ఆలయానికి వచ్చారు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి చెప్పులను బద్రపరిచినందుకు గాను రూ.10 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చి ముందుకు పోతుండగా ఎక్కడకు పోతున్నావని అడిగాడు. అమ్మవారి ఫొటో కొనేందుకు అని చెప్పడంతో తెలిసిన షాపు ఉందని చెప్పి తీసుకుని వెళ్లాడు. క్యాబ్ బుక్ చేసుకొని వెళ్లే క్రమంలో రాజశేఖర్ వెనుకాలే వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అతని చేతిలో ఉన్న సెల్ ఫోన్‌ను లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

PUBLIC NOTICE

All the general public is hereby informed that my client is intending to purchase **Open Plot No. 141,** admeasuring **556 Sq. Yards,** in Survey No. 24, Part No. 5, situated at **Peeramcheruvu Village, under Bandlaguda Municipal Corporation, Gandipet Mandal, Ranga Reddy District,** from its lawful owner and possessor **Smt. Katta Veena Reddy,** W/o Late K. Damodhar Reddy. The said plot is bounded as follows: **North:** 40' wide road, **South:** Plot No. 136, **East:** Plot No.142, **West:**